క్లుప్తంగా

తెలుగు భాష వారోత్సవాలు ప్రారంభం



పద్య రచనలో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 29 వ తేదీన వ్యవహారిక భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని జరుపుకునే తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం గిడుగు జయంతి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. పాఠశాలలో ఆసక్తి గల విద్యార్థులకు పద్య పఠన, రచన పోటీలను తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు రోజుకో అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి తెలుగు భాషా దినోత్సవం రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఐరావతంపై ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చేనేత సంఘం ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం ద్రౌపదీధర్మరాజుల స్వామి విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను ఐరావతంపై పుర వీధుల్లో ఊరేగించారు.

ఇటుక బట్టీల్లో తనిఖీలు



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని ఇటుక బట్టీలను తిరుపతి జిల్లా ఉప కార్మిక కమిషనర్ బాలు నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇటుక బట్టీలు, దుకాణాల్లో పిల్లలను నియమించుకోవడం, బడికి వెళ్లవలసిన వయసులో పనిచేయించుకోవడం చట్టరీత్యా నేరమని ఆయన యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కృష్ణారెడ్డి, సహాయ అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో ఇక్కట్లు



రోడ్డు పక్కన పడేసిన కోళ్ల కళేబరాలు, వ్యర్థాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక చెరువు కట్ట వద్ద తిరుపతి–శ్రీకాళహస్తి ప్రధాన రహదారి పక్కన ఉన్న కోళ్ల వ్యర్థాలతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏర్పేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట పట్టణాల్లోని కోళ్ల మాంసం వ్యాపారులు వాటి కళేబరాలు, వ్యర్థాలను రాత్రిళ్లు ఆటోల్లో తీసుకొచ్చి మేర్లపాక చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన పడేస్తున్నారు. వీటి నుంచి దుర్వాసన వస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, బస్సుల్లో వెళుతున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మధు(ఫైల్)

నాగలాపురం: భార్య కాపురానికి రాలేదని మధు(29) అనే వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నందనం గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ కథనం మేరకు.. నందనం గ్రామానికి చెందిన మధు, సెల్వి దంపతుల మధ్య వివాదం తలెత్తడంతో ఆమె కాపురానికి రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మధు రెండు రోజులు క్రితం విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని తిరుపతి రుయాకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఆయన చెప్పారు.

బడి బయట పిల్లలు బడికి..

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడీడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 ముని సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన అలత్తూరు గ్రామ దళితవాడలో ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మాట్లాడి స్కూల్‌కు పంపించారు.

చంద్రయాన్-3 విజయోత్సవం



జాతీయ జెండాతో విజయ చిహ్నం చూపుతున్న వరదయ్యపాళెం హైస్కూల్ విద్యార్థులు

సత్యవేడు: చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ విజయం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే స్థానిక బాలుర గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి చంద్రయాన్-3 చంద్రుడిపై దిగే దృశ్యాలను టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాదిమంది భారతీయుల కలను ఇస్రో శాస్త్రవేత్తలు నెరవేర్చారని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురం : ఇస్రో తలపెట్టిన చంద్రయాన్-3 విజయవంతం కావాలని మండలంలోని సురుటుపల్లిలో వెలసిన శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో టెంపుల్ చైర్మన్ ఏఎం మునిశేఖర్ రెడ్డి(బాలాజిరెడ్డి) ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. దేశం గర్వించదగిన చంద్రయాన్-3 వంటి గొప్ప సాహసానికి నడుం బిగించిన మన శాస్త్రవేత్తలు ప్రతిఒక్కరూ అండగా నిలిచిన సమయం ఇదన్నారు. దేవుని ఆశీసులతో చంద్రయాన్-3 విజయవంతం అయిందని మాజీ ఎమ్మెల్సీ జయచంద్ర నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ కావడంపై సర్వత్రా సంబరాలు జరిగాయి. వరదయ్యపాళెం హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాను చేత పట్టుకుని విజయ చిహ్నం చూపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులతో కలసి డిజిటల్ స్క్రీన్‌పై చంద్రయాన్-3 దిగే సన్నివేశాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బందిల కుమార్, రాజయ్య తదితరులు ఉన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: ఎంతో అందంగా కనిపించే చంద్రుడి ఉపరితలంపై దాగి ఉన్న అంశాలపై శోధించేందుకు పంపిన చంద్రయాన్ మిషన్ విజయవంతం కావడంపై పలువురు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణవనంలో పలువురు స్వీట్లు పంచారు. సాయంత్రం 6.04 గంటలకు బాలుర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు కూడలి వద్ద సచివాలయ జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ప్రజాప్రతినిధులు గురుస్వామి, మోహన్, సారకాయలు, దొరైరాజ్, రామలింగం తదితరులు స్వీట్లు పంచిపెట్టారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభను కొనియాడారు.

రేణిగుంట: చంద్రయాన్-3 విజయవంతమైనందుకు బుధవారం రేణిగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మన్యం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.



పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గుడి చైర్మన్ ప్రజలు



నారాయణవనంలో స్వీట్లు పంచుతున్న స్థానికులు



చంద్రుడిపై దిగుతున్న విక్రమ్ ల్యాండర్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు



రేణిగుంట గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మన్యం శ్రీనివాసులురెడ్డి

నాడు-నేడు పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నాడు-నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల్లో నాడు-నేడు కార్యక్రమంలో 2వ విడతలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ, భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాల్లో రూ.5 కోట్లతో పనులను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రెండవ విడత విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల భవనాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. నాణ్యతగా త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మహాగణపతి విగ్రహ ప్రతిష్ట



మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠలో వేదమంత్రాలు జరిపిస్తున్న అర్చకులు



కుంభాభిషేక కలశ తీర్థాన్ని తీసుకుంటున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలోని ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు హోమపూజలు చేసి, ఆలయం పైభాగాన కలశాలను ఏర్పాటు చేశారు. గిరిజనులు, గ్రామస్తులచే కలశ పూజలు చేయించారు. అనంతరం మహాగణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతి ఆలయాన్ని గిరిజన కాలనీలో సర్పంచ్ రామ్మూర్తి తన సొంత డబ్బులతో నిర్మించడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొనగా, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటనపై సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ, సంక్షేమ రథ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 28వ తేదీన నగరి నియోజకవర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, గృహసారథులతో సీఎం పర్యటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కూడా జనం తరలి వచ్చేలా నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు చూడాలన్నారు. అసమానతలు లేని పాలన నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అందిస్తే నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ నెల 26న శనివారం నాగలాపురంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, రామచంద్రా రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

ఈ నెల 28న నగరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరిలో సీఎం జగన్ పర్యటనను విజయవంతం అయ్యేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

భూతవాహనంపై వీరభద్రుడు



భూతవాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం : మండలకేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు భూతవాహనంపై అధిష్టించి పుర వీధుల్లో విహరించారు. అర్చకులు ఉదయం భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సుగంధ పుష్పాలు, పట్టు వస్త్రాలతో వీరభద్రున్ని అలంకరించగా కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరించారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు. గురువారం స్వామి వారు శేషవాహనంపై ఊరేగనున్నారు.

నేడు గడప గడపకు ..

సత్యవేడు: మండలంలోని గొల్లపాళెం(ఇరుగుళం పంచాయతీ), మల్లవారిపాళెం పంచాయతీల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. మండల అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షునిగా పానగల్‌కు చెందిన తలపా దామోదర్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియమించారు. గతంలో యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న మధురెడ్డి మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక కావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో ఆ స్థానంలో తలపా దామోదర్‌రెడ్డిని నియమించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని చెల్లూరు ఎస్సీ కాలనీలో మృతుడి కుటుంబానికి బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. చెల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన పుచ్చకాయల కర్రెయ్య (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకుగాను రూ.5 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మధు యాదవ్, వేణు యాదవ్, జీపీ యాదవ్, యుగంధర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు ప్రశాంత నిలయాలు



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పవిత్రా రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): గ్రామాల్లో దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. మండలంలోని బోనుపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ గంగమ్మతల్లి ఆలయానికి బుధవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ సిద్ధయ్య, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్రనాయుడు, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య నాయుడు, నాయకులు జయరామయ్య, వీరయ్య, యల్లయ్య, గంగయ్య, ఈశ్వరయ్య అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన రేణిగుంట జాతర





అమ్మవారికి నైవేద్యం తీసుకొస్తున్న చిన్నారులు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రేణిగుంట: గంగమ్మజాతర ఉత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. కొలువైన గంగమ్మను అశేష భక్తజనం దర్శించుకున్నారు. వేపాకు పందిరిలో అమ్మవారి పసుపు ప్రతిమను భక్తుల దివ్య దర్శనార్థం ఉంచారు. సాయంత్రం అమ్మవారికి కుంభం పెట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఒళ్లంతా వేపాకు చుట్టుకుని భైరాగి వేషాలతో దిష్టి కుండలను నెత్తిన పెట్టుకుని మహిళలు, చిన్నారులు నడివీధి గంగమ్మ వద్దకు చేరుకున్నారు. ప్రధాన వీధులన్నీ భక్తకోటితో కిక్కిరిశాయి. అర్ధరాత్రి తరువాత అమ్మవారి పసుపు ప్రతిమను నిమజ్జనం చేయడంతో జాతర పర్వం ముగిసింది.

రైతుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం





మార్కెట్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా మార్కెట్ కమిటీ పనిచేయాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మొదటి సమావేశం బుధవారం మార్కెట్ కమిటీ హాల్‌లో నిర్వహించారు. మార్కెట్ కమిటీ అజెండాను సెక్రటరీ సెల్వమణి చదివి వినిపించగా నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ మధురెడ్డి, సభ్యులు ఆధ్వర్యంలో చర్చించారు. దీనికి గౌరవ అధ్యక్షుని హోదాలో హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పనిచేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్‌పై మొదటి అంతస్తు, డీసీసీబీ తరపున 6 గోదాములు నిర్మించనున్నట్లు తెలిపారు. గిట్టుబాటు ధర వచ్చే వరకు గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్, సంతకు తాగునీటి సౌకర్యం కోసం నూతనంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కోల్డ్ స్టోరేజీ గోదాములు కూడా త్వరలోనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులు వ్యాపారం చేసుకోవడానికి అనుగుణంగా త్వరలో 40 షాపులను నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. మార్కెట్ కమిటీ తరపున పెట్రోల్‌బంకు ఏర్పాటు చేస్తే ఆర్థికంగా మార్కెట్ కమిటీ బలపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసునాయుడు, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ లక్కమనేని కృష్ణ, కందాటి ఈశ్వర్‌రెడ్డి, అధికారులు ఏడీ రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే పెద్దపీట

రేణిగుంట: పేద ప్రజల అభ్యున్నతికే జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆయన రేణిగుంట మండలం అత్తూరు సచివాలయ పరిధిలోని ఇసికిమిట్ట, మొలగమూడి దళితవాడ, సుందరమ్మ కండ్రిగ గ్రామల్లో పర్యటించారు. ఆయనకు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్ గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ నవరత్నాల ద్వారా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి సగటున రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు నవరత్నాల ద్వారా వ్యక్తిగత లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ ఫలాలు గణాంకాల రూపంలో కళ్లముందు కనిపిస్తున్నాయని చెప్పారు. ఇదే జగనన్న పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, ఉప సర్పంచ్ హైమావతి, జానకిరామ్‌రెడ్డి, బాబురెడ్డి, సాంబ, వెంకటముని, సిద్దమునిరెడ్డి, గంగిరెడ్డి, మునిక్రిష్ణారెడ్డి, సుబ్బయ్య, గంగయ్య, విమల, పారిజాతం పాల్గొన్నారు.

రైతులకు పశుగ్రాసం విత్తనాలు పంపిణీ



రైతులకు పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు అధిక దిగుబడినిచ్చే కె.ఎఫ్.ఎస్ -31 రకం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ రకం పశుగ్రాసంలో మాంసకృత్తులు ఎక్కువగా ఉండి పశువుల పాల దిగుబడి పెంచడంలో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే పశుసంవర్ధక శాస్త్రవేత్త అనూష పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

వరదయ్యపాళెం: విధి నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తే తప్పక గుర్తింపు వస్తుందని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న తహసీల్దార్ గౌరిశంకరరావు, మండల పరిషత్ సీనియర్ సహాయకుడు మురళీకృష్ణ, ఆర్ఐ వేణుగోపాల్‌ను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ సురేష్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.